సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
78932 44734
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఐక్య ఉద్యమాలతోనే 'ఉక్కు' పరిరక్షణ



920వ రోజు ఉక్కు దీక్షలో నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రజలందరి ఆస్తి అని, దానిని కాపాడుకునేందుకు ప్రతి తెలుగువాడు ఉద్యమించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఐక్య ఉద్యమాలతోనే ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకోగలమని, అందరూ కలిసి రావాలని కోరారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన కార్మికుల నిరసన దీక్షలు ఆదివారానికి 920వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పాలన వల్ల దేశ ప్రజలు దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారన్నారు. లక్షల కంపెనీలు మూతపడ్డాయని, కార్మికులు పనిలేక రోడ్డున పడ్డారని విమర్శించారు. విదేశాల నుంచి నల్ల ధనాన్ని తీసుకువస్తానని చెప్పి బ్యాంకులను ఊడ్చేశారని ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తే విశాఖ ఉక్కుకు సానుకూల స్పందన లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

జోరుగా యూనియన్ల ప్రచారం



భెల్ టౌన్‌షిప్‌లో ప్రచారంలో పాల్గొన్న ఏఐటీయూసీ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 31న జరగనున్న భెల్ (హెచ్‌పీవీపీ) విశాఖపట్నం యూనిట్ గుర్తింపు యూనియన్ ఎన్నికలకు ప్రచారం జోరుగా సాగుతోంది. ఏఐటీయూసీ యునైటెడ్ ఫ్రంట్ మిత్రపక్షాలు భెల్ టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కొల్లి దేముడు, బోండా బాబూరావు, సుభాకర్ సాహు, ఎ.వెంకటరావు, జె.రాము, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

మహాశక్తి పథకంపై ప్రచారం

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు న్యూ కరాసాలో టీడీపీ మహాశక్తి పథకంపై ప్రచారం నిర్వహించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు మందలపు వాసుదేవరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సీతారామ్, వెంకు మహంతి చంద్రశేఖర్, శ్రీను లాలం లావణ్య తదితరులు పాల్గొన్నారు.

61వ వార్డులో 'నారీ భేరి'

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలో ఆదివారం టీడీపీ వార్డు మహిళా నాయకులు నారీ భేరి కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ జిల్లా కమిటీ పిలుపు మేరకు వార్డు మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి శ్రీలక్ష్మి స్థానిక మహిళా నాయకులు, కార్యకర్తలతో కలిసి మల్కాపురం వీధుల్లోని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. 2024లో టీడీపీ అధికారంలోకి వస్తే చేసే అభివృద్ధి పనులను, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎదుర్కుంటున్న ఇబ్బందులు వంటి వాటిని తెలియజేశారు.

నిరుపయోగంగా హాకర్స్ జోన్

- ఆకతాయిలకు అడ్డాగా మారిన వైనం
- వినియోగంలోకి తీసుకురావాలని స్థానికుల విజ్ఞప్తి



గుల్లలపాలెం వుడా కాలనీ హాకర్స్ జోన్‌లో ఖాళీగా స్టాళ్లు

మల్కాపురం: ఫుట్‌పాత్, చిరు వ్యాపారుల కోసం లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన హాకర్స్ జోన్ చివరికి నిరుపయోగంగా మిగిలింది. జోన్‌లో ఎటువంటి వ్యాపారాలు జరగక స్టాళ్లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఆకతాయిలు, మందుబాబుల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. వినియోగంలో లేని హాకర్స్ జోన్‌లో మందుబాబులు చేరి మద్యం తాగుతుండగా.. యాచకులు సేద తీరుతున్నారు. జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలోని హాకర్స్ జోన్ దుస్థితి ఇది. సుమారు రూ.17 లక్షల వ్యయంతో ఈ ప్రాంతంలో 2014లో హాకర్స్ జోన్ ఏర్పాటు చేశారు. మల్కాపురం నుంచి జింక్ వరకు పలువురు ఫుట్‌పాత్ వ్యాపారుల కోసం దీన్ని నిర్మించారు.

హాకర్స్ జోన్ పాయింట్‌లోకి తాము రాలేమని, అక్కడ తమ వ్యాపారాలు సాగవని, రోడ్డుపైనే గిట్టుబాటు అవుతుందని ఫుట్‌పాత్ వ్యాపారులు నిరాకరించారు. నాటి నుంచి ఈ హాకర్స్ జోన్ ఖాళీగానే ఉండిపోయింది. దీంతో స్థానికంగా పలువురు వ్యాపారులు ఎటువంటి అద్దె చెల్లించకుండా, జీవీఎంసీ అధికారుల అనుమతులు తీసుకోకుండా కొన్ని షాపుల్లో వ్యాపారాలు సాగిస్తున్నారు. మరి కొన్ని దుకాణాలు ఆకతాయిలు మద్యం తాగేందుకు, యాచకులు విశ్రాంతి తీసుకునేందుకు ఉపయోగపడుతున్నాయి. ఈ హాకర్స్ జోన్‌లోని ఓ స్టాల్‌లో అనధికారికంగా ఔట్ సోర్సింగ్ వర్కర్స్ పారిశుధ్య కార్మికుల ఆఫీస్ రూమ్ నిర్వహిస్తున్నారు. లక్షల రూపాయలతో నిర్మించిన హాకర్స్ జోన్ ఇలా నిరుపయోగంగా మారిందని అధికారుల వద్ద మొర పెట్టుకున్నా.. నేటికీ స్పందన లేదని పలువురు స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి హాకర్స్ జోన్‌లో వ్యాపారాలు జరిగేలా చూడాలని, లేదా ప్రజా అవసరాల కోసం దీనిని వినియోగించాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

గుల్లలపాలెం వుడా కాలనీ హాకర్స్ జోన్ సమస్య నా దృష్టిలో లేదు. దీనిపై అధికారులను అక్కడ పరిస్థితిని తెలుసుకోవాలని ఆదేశిస్తాను. సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతాం.
– ఆర్.జి.వి.కృష్ణ, జోన్–5 కమిషనర్, జీవీఎంసీ

ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మల్కాపురం: ప్రజల్లోకి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా తీసుకెళ్లాలని మాజీ కార్పొరేటర్, 58, 59, 60 వార్డుల వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు పిల్లా కన్నబాబు పిలుపునిచ్చారు. 60వ వార్డులో స్థానిక నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరారు. వార్డు ముఖ్య నాయకులు నరేష్, అంగ రామ్‌ప్రసాద్, మళ్ల ధనలత, ఆడారి హరీష్, మనోహర్, బిల్డర్ శ్రీను తదితరులతో ఆదివారం ఆయన తన నివాసం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. వార్డులో ప్రతి ఒక్క నాయకుడు సిద్ధంగా ఉండాలన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడమే కాకుండా.. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, వాటి వల్ల చేకూరుతున్న లబ్ధిని వారికి వివరించాలని పేర్కొన్నారు.

అద్దెకు దిగిన ఇల్లు తనదంటూ దౌర్జన్యం

- పోలీసులను ఆశ్రయించిన వృద్ధుడు

సింధియా: వృద్ధాప్యంలో తోడుగా ఉంటానని మాయమాటలు చెప్పి రెండేళ్ల కిందట అద్దెకు దిగిన ఓ యువకుడు.. ప్రస్తుతం ఆ ఇల్లు తనకే చెందుతుందని ఎదురు తిరగడంతో సదరు ఇంటి యజమాని మల్కాపురం పోలీసులను ఆశ్రయించాడు. వివరాలిలా.. జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవలో దువ్వాడ పైడిరాజు అనే వృద్ధుడు నివసిస్తున్నాడు. తన భార్య నూకమ్మ మొదటి భర్త కుమారుడు దువ్వాడ అప్పారావు కుమారుడైన దువ్వాడ నాగరాజుకు రెండేళ్ల కిందట తన ఇంటిలో కొంత భాగాన్ని అతడు అద్దెకు ఇచ్చాడు. ఆ సమయంలో హక్కుదారుడైన దువ్వాడ పైడిరాజును అన్నీ తానై చూసుకుంటానని వృద్ధుడి కుమార్తెలను నాగరాజు నమ్మబలికి ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. కేవలం మూడు నెలల అద్దె మాత్రం చెల్లించి.. ఆపై పైడిరాజును పట్టించుకోవడం మానేశాడు. తనకు వచ్చే పెన్షన్ సొమ్ము, కూతుళ్లు ఇచ్చే డబ్బులతో కాలం గడుపుతున్న పైడిరాజుపై దౌర్జన్యంగా ప్రవర్తిస్తూ ఇంటిని ఖాళీ చేయకుండా తిష్ట వేశాడు. ఇంటికి సంబంధించిన హక్కు పత్రాలు తన వద్దే ఉన్నాయని, నాగరాజు చేత ఇల్లు ఖాళీ చేయించి ఇవ్వాలని కోరుతూ మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో వృద్ధుడు పైడిరాజు ఆదివారం ఫిర్యాదు చేశాడు. తన ఇంటిని ఖాళీ చేయకుండా కొంతమంది అండదండలతో నాగరాజు బెదరిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలంటూ బాధితుడు పైడిరాజు తన ఇంటి ముందు దీక్షకు దిగాడు.

జీవితాల్లో 'మార్పు' తెచ్చుకోండి



రౌడీషీటర్లకు అవగాహన కల్పిస్తున్న క్రైం డీసీపీ గంధం నాగన్న

అల్లిపురం: జీవన విధానంలో మార్పు తెచ్చుకొని జీవితాలను ఉన్నతంగా మార్చుకోవాలని రౌడీ షీటర్లకు క్రైం డీసీపీ గంధం నాగన్న సూచించారు. టూటౌన్ దరి సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం ఉదయం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీట్లతో జీవితాలను పాడు చేసుకోకూడదన్నారు. నేరాలకు దూరంగా ఉండాలని, గత జీవితాన్ని మార్చుకుని కష్టపడి పనిచేయాలని సూచించారు. ప్రతి క్షణం మీరు చేసే పనులపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. కష్టపడి పనిచేసే వారిని గుర్తించి, వారిపై రౌడీ షీట్ తొలగించేందుకు ప్రయత్నిస్తామన్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు నగరంలో నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మార్పు కార్యక్రమం ద్వారా నేరాలు చేస్తున్న వారి జీవితాల్లో మార్పు తీసురావాలనేది ప్రధాన ఉద్దేశమని తెలిపారు. నేరమయ జీవితాన్ని విడనాడిన వారిని గుర్తించి అవసరమైన వారికి తమ వంతు సహకారం అందించనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరితో మాట్లాడి వారి స్థితిగతులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో క్రైం ఏసీపీ, టూటౌన్, మహారాణిపేట సీఐలు పాల్గొన్నారు.

శాంతితోనే అభివృద్ధి సాధ్యం

సీతంపేట: ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ విశాఖపట్నం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ప్రాంగణంలోని గాంధీ సెంటర్‌లో 'ప్రపంచ శాంతి, గాంధీ మార్గం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ కౌన్సిల్ సభ్యుడు నరవ ప్రకాశరావు మాట్లాడుతూ మతాల మధ్య సమాఖ్య స్ఫూర్తి, పరస్పర అవగాహన, గౌరవం ఉన్నప్పుడే శాంతి సాధ్యమన్నారు. గాంధీ ఎల్లప్పుడూ మత సమైఖ్యత గురించే మాట్లాడే వారని, ఆయన కృషిని గుర్తించి అక్టోబర్ 2న అంతర్జాతీయ అహింసా దినంగా పాటిస్తున్నారని తెలిపారు. గాంధేయవాది డాక్టర్ రావిప్రోలు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శాంతితోనే అభివృద్ధి సాధ్యమని, ఇది ప్రతి కుటుంబం, సమాజం నుంచి ప్రారంభం కావాలన్నారు. హరగోపాల్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

శ్రావ్యంగా కచేరీ

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో అమెరికాకు చెందిన అమృత వర్షిణి అచ్చల వీణావాదన కచేరీ శ్రావ్యంగా సాగింది. వీఎంఏ ఉపాధ్యక్షుడు రాజారావు, కార్యదర్శి ఎం.ఎస్.శ్రీనివాస్, నాదాలయ నిర్వాహకుడు వంకాల వెంకటరమణ జ్యోతి ప్రజ్వలన చేసి, కచేరీని ప్రారంభించారు. అమృత వర్షిణి వీణా కచేరీకి మృదంగంపై సరస్వతుల హనుమంతరావు సహకరించారు.

మంచి నడవడికతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: సమాజంలో మంచి నడవడికతో మెలగాలని రౌడీ షీటర్లకు పోలీసులు సూచించారు. ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లు, పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు, పలు వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు మాట్లాడుతూ ఎవరైనా నగరం దాటి ఇతర ప్రాంతాలకు వెళ్తే సమాచారమివ్వాలని సూచించారు. ఎవరు ఎక్కడికి వెళ్లిన ముందుకు తమకు సమాచారం అందించాలన్నారు. సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని, బార్‌ల వద్ద తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకూడదన్నారు. నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని సీఐ హితవు పలికారు. కౌన్సెలింగ్ అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులకు సిబ్బంది అప్పగించారు. కార్యక్రమంలో ఎస్ఐలు ధర్మేంద్ర, అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల జోలికి పోవద్దు..

స్థానిక ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు సీఐ శ్రీనివాసరావు కౌన్సెలింగ్ చేశారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు.

'సమాజ చైతన్య దీపికలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు

సీతంపేట: సామాజిక అంశాలతో 'సమాజ చైతన్య దీపికలు' అనే పేరుతో పుస్తకాన్ని రాయడం అభినందనీయమని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. కళావేదిక కల్చరల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో తురగా వెంకట నాగేశ్వరరావు రచించిన సమాజ చైతన్య దీపికలు కవితా సంపుటి పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథి పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న అంశాలను తన కవితా సంపుటిలో రచయిత చక్కగా వివరించారన్నారు. ఇటువంటి కవితా సంపుటిలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. రచయిత డి.వి.సూర్యారావు పుస్తకాన్ని విశ్లేషించారు. ఈ సందర్భంగా రచయిత నాగేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి ఆలయ మాజీ చైర్మన్ వంకాయల తాతారావు, రచయిత, కళావేదిక వ్యవస్థాపకుడు నందూరి రామకృష్ణ, లెఫ్టినెంట్ కల్నల్ ఎ.కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్డీవో రద్దు

మహారాణిపేట: సోమవారం జరిగే డయల్ యువర్ ఆర్డీవో కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం లేదన్నారు. అందువల్ల ఫిర్యాదుదారులు ఎవరూ ఫోన్ చేయవద్దని ఆర్డీవో కోరారు.

సింహాచలేశుడికి శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, అధికారులు, భక్తులు



నిత్య కల్యాణంలో యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలో అధిష్టింపజేసి, ఉభయదాతలను స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహిస్తూ 108 స్వర్ణపుష్పాలతో అర్చన చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కమనీయం.. నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం కనుల పండువగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేయింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

కిటకిటలాడిన ఎర్నిమాంబ ఆలయం



అమ్మవారికి హారతిస్తున్న భక్తులు, అర్చకులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం కాన్వెంటు కూడలిలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం శ్రావణ మాస శుద్ధ విదియ ఆదివారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. దేవదాయ శాఖ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలకు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటావార్పు చేసుకుని మేళతాళాలతో మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల వంటావార్పులకు నీడ లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై ఈవో సురేష్ బాబా మాట్లాడుతూ భక్తుల వంటావార్పులకు శాశ్వత టెంట్‌లను, వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది లేకుండా త్వరలో 30 అడుగుల ఎత్తు షెడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, అప్పలరాజు తదితరులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

లంకా మైదానంలో 'అనంత పంచముఖ గణేశుడు'

- భారీ గణపతి నమూనా విగ్రహం ఆవిష్కరణ

గాజువాక: పాత గాజువాక లంకా మైదానంలో రూపు దిద్దుకొంటున్న భారీ గణపతి విగ్రహ నమూనాను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆదివారం ఆవిష్కరించారు. వచ్చేనెల 18 నుంచి ఇక్కడ నిర్వహించనున్న ఉత్సవాలకు రూపొందుతున్న విగ్రహానికి అనంత పంచముఖ గణేశునిగా నామకరణం చేశారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, సురేష్, ఇమ్రాన్, నిర్వాహకుడు గణేష్, స్థానిక నాయకులు పల్లా చినతల్లి, యువశ్రీ, బాటా శ్రీను, గూటూరు శంకరరావు, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

సంస్థ ప్రగతిలో మానవ వనరుల నిర్వహణ కీలకం



ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు ఆదినారాయణను సత్కరిస్తున్న ఆచార్యులు



సదస్సుకు హాజరైన విద్యార్థులు

ఏయూ క్యాంపస్: సంస్థ ప్రగతిలో మానవ వనరుల నిర్వహణ ఎంతో కీలకమని ఏఐటీయూసీ(ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కౌన్సిల్) జాతీయ ఉపాధ్యక్షుడు, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ వర్కర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ డి.ఆదినారాయణ అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన ట్రేడ్ యూనియన్‌– ఇండస్ట్రియల్ రిలేషన్స్ అనే అంశంపై ఆయన మాట్లాడారు. మానవ వనరుల మేనేజర్‌గా విధి నిర్వహణలో ఎదుర్కొనే వివిధ సవాళ్లు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలతో సమన్వయం చేయడం, యాజమాన్యానికి, కార్మిక సంఘాలకు మధ్య సహృద్భావ వాతావరణాన్ని కల్పించడం ఎంతో అవసరమన్నారు. సంస్థ అభివృద్ధికి, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి మానవతా దృక్పథంతో పని చేయాలన్నారు. కార్మిక చట్టాలను అమలు చేయాలని సూచించారు. అనంతరం ఆదినారాయణను విభాగాధిపతి ఆచార్య జాలాది రవి సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.సుబ్బయ్య, డాక్టర్ వై.ఆర్.రెడ్డి, ఎంబీఏ, హెచ్‌ఆర్ఎం విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

పూడిక తీశారు.. తొలగించడం మరిచారు!



గవర కంచరపాలెంలో గెడ్డ వద్ద గుట్టలా పేరుకుపోయిన పూడికలు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు రామ్మూర్తిపంతులుపేట నుంచి గవర కంచరపాలేనికి వెళ్లే ప్రధాన గెడ్డలో గత నెలలో పొక్లెయిన్‌తో పారిశుధ్య సిబ్బంది పూడికలు తీశారు. రోజులు గడుస్తున్నా.. మురుగు మట్టి, చెత్తాచెదారాన్ని తొలగించడం మరిచిపోయారు. పబ్లిక్ హెల్త్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తీసిన పూడికలు మళ్లీ గెడ్డల్లోకి వర్షపు నీటితో జారుకుంటున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.
– రమేష్‌బాబు, గవర కంచరపాలెం

దుర్వాసన భరించలేకపోతున్నాం..!



కొత్తవాడ వీధి గెడ్డలో వ్యర్థాలు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం కొత్తవాడ వీధి నుంచి అశోక్‌నగర్, జాషువానగర్ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న గెడ్డలో పూడికలు పేరుకుపోయాయి. పారిశుధ్య సిబ్బంది సక్రమంగా పూడిక తీయకపోవడంతో పరిసర ప్రాంతాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. వర్షాలు పడేటప్పుడు చెత్తాచెదారం గెడ్డల్లో అడ్డంగా నిలవడంతో పందులు చేరుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి గెడ్డ శుభ్రతకు చర్యలు తీసుకోవాలి.
– ఎస్.బాలాజీ, అశోక్‌నగర్

శాస్త్రీయ నృత్యం అదరహో..



బృంద నృత్యం చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆద్యంతం అలరించింది. నగరానికి చెందిన లలిత డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు అద్భుతమైన పద నర్తన, హావభావాలతో ప్రేక్షకుల హృదయాలను దోచుకున్నారు. కళాకారులు అనన్య, పవిత్ర, లీలా, సౌమ్య, భావన, సిరిచందన, దివ్య, హేమ సుధ, దివ్యశ్రీ, నీహారిక, లక్ష్మి, రేఖ, వర్షిణి, నిత్య, సంయుక్త, ఐశ్వర్య, హరిణి, హేమశ్రీ నృత్యం చేయగా ఎం.లలిత, జి.సోని నృత్య దర్శకత్వం వహించారు. కార్యక్రమాన్ని స్థానిక ఏవో టి.విశ్వనాథ రెడ్డి పర్యవేక్షించారు.

వైభవంగా శ్రావణలక్ష్మి పూజలు

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు ఆదివారంతో నాలుగో రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేద మంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మి పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
8978872250

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com